

రామ్‌మందిర్‌లో దీపాలు వెలిగించి.. సదర్ సంబరంలో హోరెత్తించిన జగ్గారెడ్డి





రామ్‌మందిర్‌లో దీపాలు వెలిగిస్తున్న జగ్గారెడ్డి, సదర్ సమ్మేళనంలో డ్యాన్స్ చేస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్



దున్నరాజుపై జగ్గారెడ్డి

సంగారెడ్డి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : కార్తీకపౌర్ణమి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని రాంనగర్ రాంమందిర్‌లో జగ్గారెడ్డి దీపాలు వెలిగించారు. అనంతరం సంగారెడ్డి ఐబీ గెస్ట్‌హౌస్ వద్ద భారీ ఎత్తున నిర్వహించిన సదర్ సమ్మేళనంలో పాల్గొన్నారు. దున్నరాజుపై ఆసీనులై వేదిక వద్దకు చేరుకున్నారు. గొల్లకుర్మలను ఉద్దేశించి మాట్లాడిన తర్వాత తన దైన శైలిలో భజన గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో చేర్యాల ఆంజనేయులు, తోపాజి అనంతకిషన్, కూన సంతోష్, ప్రదీప్, శ్రీశైలంయాదవ్, బాలుయాదవ్, మహేష్, నాగారాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఘోరం

కార్తీక పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయుడి దర్శనం చేసుకుని వస్తున్న ఆనందం వారిలో ఎంతోసేపు నిలవలేదు. ఇంకొద్ది సేపట్లో ఇంటికి చేరుకోబోతున్నారనగా మృత్యువు వారిని కర్ణాటక సరిహద్దులో కబళించింది. కారులో వెళ్లిన ఐదుగురిలో నలుగురు దారుణ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఆకస్మికంగా తమ కుటుంబ పెద్దలను, ఏకైక కుమారుడిని కోల్పోయిన ఆ కుటుంబాల రోదనలు మిన్నంటాయి.

- నాలుగు కుటుంబాల్లో విషాదం
- దైవ దర్శనం చేసుకుని తిరుగు పయనంలో రోడ్డు ప్రమాదం
- బీదర్ జిల్లాలో ఘటన
- నలుగురి దుర్మరణం...
- ఒకరి పరిస్థితి విషమం
- జగన్నాథపురంలో శోకసంద్రం

నారాయణఖేడ్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌ప్రాంతానికి చెందిన నలుగురు మృత్యువాత పడగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్ గ్రామానికి చెందినబిరాదర్ రాచప్ప(45), కాశీనాథ్(60), నవీన్(30), బిరాదర్ ప్రతాప్(32), మనూరు మండలం ఎల్గోయి గ్రామానికి చెందిన నాగరాజు(40) కలిసి కర్ణాటకలోని గానుగాపూర్ దత్తాత్రేయుడిని దర్శించుకునేందుకు మంగళవారం రాత్రి కారులో వెళ్లారు. బుధవారం తెల్లవారుజామున దర్శనం పూర్తిచేసుకుని తిరిగి వస్తుండగా బీదర్ జిల్లా హాలికేడ్ సమీపంలోని కాదర్‌పూర్ వద్ద బొలెరో ఢీకొన్నది. ఈ దుర్ఘటనలో రాచప్ప, నవీన్, నాగరాజు, కాశీనాథ్ ప్రాణాలు కోల్పోయారు.



బిరాదర్ కాశీనాథ్, రాచప్ప

నవీన్, నాగరాజు

తీవ్ర గాయాలపాలైన ప్రతాప్ పరిస్థితి విషమంగా ఉంది.

ఒక్కగానొక్క కొడుకును కోల్పోయి

మృతులలో ఒకరైన నవీన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను శర్ణప్ప, సత్యమ్మ దంపతులకు ఒక్కగానొక్క కొడుకు. వృద్ధాప్యంలో తమను చూసుకునే కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి రోదన గ్రామస్థులను కలిచి వేసింది. వంట పనులు చేసే రాచప్పకు భార్య నిర్మల, పెళ్లైన ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తండ్రి మరణవార్త విని కుమార్తెలు కన్నీరుమున్నీరుగా విలపించారు. వ్యవసాయం చేసే కాశీనాథ్‌కు ముగ్గురు కుమారులున్నారు. ఎంతో కష్టపడే తమ తండ్రి మృతితో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో కూరుకుపోయింది. మనూరు మండలం ఎల్గోయి గ్రామానికి చెందిన నాగరాజు నారాయణఖేడ్‌లోని ఒక ప్రైవేటు కళాశాలలో పదేళ్లుగా బాటనీ అధ్యాపకులుగా సేవలందిస్తున్నారు. ఆయనకు భార్య నీలవేణి, కుమార్తె, కుమారుడు మరణవార్త విని శోకసంద్రంలో మునిగిపోయారు.

సహాయక చర్యలు

ప్రమాద విషయం తెలియగానే ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్పందించారు. బీదర్ ఎమ్మెల్యే, కర్ణాటక మున్సిపల్ మంత్రి రఫీక్‌ఖాన్‌తో ఫోన్‌లో మాట్లాడి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మాజీ జడ్పీటీసీ రవీందర్‌నాయక్, మాజీ సర్పంచ్ ప్రకాష్ తదితరులు సంఘటన స్థలానికి, ఆస్పత్రికి చేరుకున్నారు. పోలీసు కార్యక్రమాలు పూర్తిచేయించి, మృతదేహాలను గ్రామానికి తరలించే ఏర్పాట్లు చేశారు. సాయంత్రం వారి అంత్యక్రియలు ముగిశాయి. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ వారి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున తక్షణ సహాయాన్ని వ్యక్తిగతంగా అందించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని సురేష్‌షెట్కార్ తెలిపారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- తప్పిన ప్రమాదం

పటాన్‌చెరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 65పై ముత్తంగి వద్ద ఓ ఆర్టీసీ బస్సు అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉండగా, ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మేడ్చల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఇస్నాపూర్ వెళ్తుండగా, ఎదురుగా ఉన్న కారును తప్పించబోయిన బస్సు బ్రేక్‌లు ఫెయిల్ అయ్యాయి. దీంతో బస్సు డివైడర్ పైకి దూసుకెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులు ఎవరూ కూడా గాయపడకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం అందిన వెంటనే పటాన్‌చెరు పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. సాంకేతిక లోపం కారణంగా ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు. ప్రమాదంతో ట్రాఫిక్ భారీ స్థాయిలో నిలిచిపోవడంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి పోలీసులు చాలా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎక్స్‌కవేటర్ సహాయంతో డివైడర్ పైకి వెళ్లిన బస్సు పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



డివైడర్‌పైకి ఎక్కిన ఆర్టీసీ బస్సు



సదాశివపేట మండలం పెద్దాపూర్‌లోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం తులసీ పూజలను నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి, దీపాలను వెలిగించారు. రాత్రివేళ దీపోత్సవాలను నిర్వహించగా మహిళలు, యువతులు పెద్దఎత్తున పాల్గొన్నారు. వివిధ ఆకృతుల్లో ప్రమిదలను వరుసలో ఉంచి దీపాలను వెలిగించారు. ఈ దీపకాంతులతో దైవక్షేత్రాలు దేదీప్యమానంగా వెలుగొందాయి.



దేదీప్యమానం





మెదక్‌లోని అయ్యప్ప ఆలయంలో



తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ శివారులోని రామప్పగుట్టపై, జహీరాబాద్ దత్తగిరి ఆశ్రమంలో

ఇంటి వద్దే ఉద్యోగమని.. మోసం

- ఇన్‌స్టాగ్రామ్‌లో లింక్‌తో నిజాంపేట యువతికి కుచ్చుటోపి
- బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.45 వేలు మాయం

నిజాంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటి వద్దనే ఉంటూ సులువుగా డబ్బు సంపాదించవచ్చనే ఆశ పడి, ఓ యువతి సైబర్ మోసగాళ్ల చేతిలో చిక్కి నగదు పోగొట్టుకుంది. వివరాల్లోకి వెళితే.. నిజాంపేట మండల కేంద్రానికి చెందిన తాడేం మౌనిక తన సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాగ్రామ్ చూస్తున్న క్రమంలో, 'ఇంటి వద్దే జాబ్' అంటూ వచ్చిన రీల్‌ను చూసింది. ఆమె, ఉద్యోగం వస్తుందనే ఆశతో ఆ రీల్ కింద ఉన్న లింక్‌ను క్లిక్ చేయగా, సంబంధిత ఫైల్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. సదురు లింకును డౌన్‌లోడ్ చేసిన కొద్ది క్షణాల్లోనే మౌనిక బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.45,000 నగదు మాయమైంది. మోసానికి గురైనట్లు తెలుసుకున్న బాధితురాలు బుధవారం నిజాంపేట పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజేష్ పలు సూచనలు చేశారు. అపరిచితుల నుంచి వచ్చే ఆన్‌లైన్ లింకులను, ముఖ్యంగా బెట్టింగ్ యాప్‌లు, లోన్ అప్లికేషన్‌ల జోలికి వెళ్లవద్దని తెలిపారు. వాటిని క్లిక్ చేయకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మోసపోతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రోత్సాహమేది?

- ఆదర్శ వివాహాలకు నిధులు లేక ఆర్థిక సాయం నిలిపివేత
- నాలుగేళ్లుగా నిరీక్షణలో జంటలు

మెదక్ అర్బన్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : కులాంతర వివాహాలు చేసుకున్న జంటలను ఆర్థికంగా ఆదుకోవాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం నిధుల కొరతతో నీరుగారిపోతోంది. ఆదర్శ వివాహాలను ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన పథకం కింద ఆర్థిక భరోసా కోసం నాలుగేళ్లుగా దరఖాస్తుదారులు ఎదురుచూస్తూనే ఉన్నారు.

పథకం ఉద్దేశం ఇదే..

కులాంతర వివాహాలు చేసుకున్న యువతీ యువకులకు అండగా నిలవడానికి ఈ పథకాన్ని ప్రారంభించారు. దంపతులలో ఒకరు షెడ్యూల్ కులానికి (ఎస్సీ) చెందిన వారైతేనే, వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.2.50 లక్షల ప్రోత్సాహకం అందిస్తున్నాయి. ఈ మొత్తాన్ని దంపతుల సంయుక్త బ్యాంకు ఖాతాలో మూడేళ్లపాటు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడం ద్వారా వారిలో ఉపాధి వైపు ప్రేరణ కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పథకం ప్రారంభంలో కేవలం రూ.10 వేలు మాత్రమే ఇవ్వగా, 2012లో దీనిని రూ.50 వేలకు, ప్రస్తుతం రూ.2.50 లక్షలకు పెంచారు.

పెండింగ్‌లో దరఖాస్తులు

జిల్లా సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయం (డీఎస్‌డీవో) లెక్కల ప్రకారం, 2021 మే నెల నుంచి ఈ ఆర్థిక సహాయం పంపిణీ నిలిచిపోయింది. జిల్లావ్యాప్తంగా మొత్తం 121 మంది దరఖాస్తు చేసుకోగా, ఈ నాలుగేళ్ల కాలంలో కేవలం 25 మంది దరఖాస్తుదారులకు మాత్రమే (2021-25 మధ్య వివిధ ఆర్థిక సంవత్సరాల్లో) ప్రోత్సాహకం అందింది. ఇంకా 96 అర్హత కలిగిన దరఖాస్తులు నిధులు లేక పెండింగ్‌లో ఉన్నాయి.

అవగాహన కరువు

ఈ పథకంపై చాలామందికి అవగాహన లేకపోవడం వల్ల కూడా అర్హులైన జంటలు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. ఈ సాయం పొందాలంటే దంపతులు వివాహ చట్టం-1955 కింద నమోదై ఉండాలి. వివాహమైన ఏడాది లోపు దరఖాస్తు చేసుకోవాలి. వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉండాలి. అవసరమైన వివాహ, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, వయసు ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, వాటిని ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. అన్ని పత్రాలు అందించినా, ఏళ్లు గడుస్తున్నా.. తమకు ఆర్థిక భరోసా అందలేదని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ వివాహిత పేర్కొన్నారు.

నిధులు రాగానే ఇస్తాం

కులాంతర వివాహం చేసుకున్న వారిలో ఒకరు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారైతే రూ.2.50 లక్షల ప్రోత్సాహకానికి అర్హులు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఐదుగురికి అందజేశాం. ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కాగానే పెండింగ్‌లో ఉన్న అర్హులకు వెంటనే అందిస్తాం.

- విజయలక్ష్మి, డీఎస్సీడీవో మెదక్

పర్యవేక్షణ లోపం.. తుది దశ పనుల్లో జాప్యం!

- పలుమార్లు గడువు పెంచినా పూర్తికాని వైనం
- నిధులు మంజూరై ఎనిమిదేళ్లయినా ఇదే తంతు
- సంగారెడ్డి జిల్లా లీగల్ మెట్రాలజీ శాఖ భవనం తీరిది

సంగారెడ్డి అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలో నిర్మిస్తున్న జిల్లా లీగల్ మెట్రాలజీ శాఖ(తూనికలు కొలతలు) కార్యాలయం అధికారి నూతన కార్యాలయ భవన నిర్మాణ తుది దశ పనుల్లో తీవ్ర జాప్యం నెలకొన్నది. అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ అలసత్వం కారణంగా నిర్మాణ పనుల్లో తాత్సారం జరుగుతున్నది. గడువులోగా భవన నిర్మాణ పనులు పూర్తి చేసి అప్పగించాల్సి ఉన్నా, ఆ దిశగా చర్యలు మాత్రం కానరావడం లేదు. ఫలితంగా సర్కారు అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు.

నిధులు పుష్కలంగా ఉన్నా

కేంద్ర ప్రభుత్వం 2018 సెప్టెంబరు 29న రూ.50 లక్షలు మంజూరు చేసింది. సంగారెడ్డి బైపాస్‌రోడ్డులోని బీసీ స్టడీ సర్కిల్ పక్కన భవన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం స్థలం 175 గజాల స్థలం కేటాయించింది. భవన నిర్మాణ బాధ్యతలను పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించారు. తొమ్మిది నెలల్లో భవన నిర్మాణ పూర్తి చేస్తామని అప్పట్లో ఒప్పందం చేసుకున్నారు. 2024 మార్చిలో నిర్మాణం మొదలుపెట్టిన కార్పొరేషన్ అదే ఏడాది నవంబరు నాటికి పనులు పూర్తి కావాల్సి ఉన్నా..పూర్తి చేయలేదు. గడువులోగా పూర్తి కాకపోవడంతో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు అగ్రిమెంట్ గడువును పలుమార్లు పెంచారు. తొలుత 2025 మార్చి నాటికి గడువు పొడిగించారు. అయినా పనుల్లో ఏ మాత్రం పురోగతి కనపించలేదు. మరోసారి జూలై నాటికి పొడిగించారు. గడువు ముగిసినా భవన నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడం అధికారుల పర్యవేక్షణ లోపానికి అద్దంపడుతున్నది.



తుది దశలో భవన నిర్మాణం

అద్దె భవనంలోనే...

సంగారెడ్డి ప్రశాంత్‌నగర్‌లో జిల్లా తూనికలు కొలతల శాఖ కార్యాలయం 25 ఏళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతున్నది. ఓవైపు కేంద్రం నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ భవన నిర్మాణ పనులు తుది దశలో జాప్యం జరగడం గమనార్హం. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే ఇంకా అద్దె భవనంలోనే కార్యాలయం కొనసాగించే పరిస్థితి ఏర్పడిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తుది పనుల్లో నెలకొన్న జాప్యాన్ని నివారించి, పక్కా భవనాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాల్సిన పలువురు కోరుతున్నారు.

350 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు రవాణా
- సినీ ఫక్కీలో విజిలెన్స్ అధికారుల ఛేజింగ్
- నర్సాపూర్ వద్ద పోలీసుల సహకారంతో పట్టివేత

నర్సాపూర్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు లారీలో భారీగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలుసుకున్న విజిలెన్స్ అధికారులు సినీ ఫక్కీలో వెంబడించి పోలీసుల సహకారంతో పట్టుకున్న ఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. నర్సాపూర్ ఎస్ఐ రంజిత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతున్నట్లు సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు లారీని పట్టుకోవడానికి వెంబడించారు. హైదరాబాద్ నుంచి పటాన్‌చెరు మీదుగా నాందేడ్ వైపు వెళ్లాల్సి ఉండగా, విజిలెన్స్ అధికారులను గమనించిన డ్రైవర్ లారీని నర్సాపూర్ వైపు మళ్లించాడు. అయినప్పటికీ లారీని వదలని విజిలెన్స్ అధికారులు వెంబడిస్తూనే నర్సాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన ఎస్ఐ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో వాహనాల తనిఖీ చేపట్టగా, తెల్లవారుజామున నర్సాపూర్‌కు చేరుకున్న లారీని పోలీసులు అడ్డుకున్నారు. విజిలెన్స్ అధికారులతో కలిసి పోలీసులు లారీని స్టేషన్‌కు తరలించి, 350 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి, స్థానిక గోదాముకు తరలించగా, లారీతో పాటు డ్రైవర్‌ను విజిలెన్స్ అధికారులు పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నర్సాపూర్‌లో స్వాధీనం చేసుకున్న లారీ

విద్యుదాఘాతంతో పౌల్ట్రీ రైతు మృతి

సిద్దిపేట రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో పౌల్ట్రీ రైతు మృతి చెందిన సంఘటన సిద్దిపేట రూరల్ మండలం సీతారాంపల్లి, మాచాపూర్ శివారులో బుధవారం చోటుచేసు కుంది. సిద్దిపేట రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం బల్వాంతపూర్ గ్రామానికి చెందిన జంగిటి రాజు (33) సీతారాంపల్లి గ్రామానికి చెందిన రైతు పడిగె నర్సయ్య వద్ద పౌల్ట్రీఫారంను లీజుకు తీసుకున్నాడు. బుధవారం కోడిపిల్లలు రావడంతో వాటిని నీళ్లు పెట్టేందుకని ఇంటిదగ్గర చెప్పివెళ్లాడు. పౌల్ట్రీఫాం వద్ద బోరుమోటార్ నడవకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసే క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు ఎంతకీ ఇంటికి రాకపోవడంతో వెళ్లి చూడగా, చనిపోయి కనిపించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రాజు మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

కోనాయిపల్లిలో తీవ్ర గాయాలు

దౌల్తాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై రైతుకు తీవ్ర గాయాలైన సంఘటన దౌల్తాబాద్ మండల పరిధిలోని కోనాయిపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనాయిపల్లి గ్రామానికి చెందిన రైతు స్వామిగౌడ్ తన వ్యవసాయ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అంబులెన్స్ మెడికల్ టెక్నీషియన్ దేవేందర్, పైలెట్ నరసింహులు బాధితుడు స్వామి గౌడ్‌ను మెరుగైన చికిత్స కోసం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



గాయాలపాలైన స్వామి గౌడ్

భలే కోడళ్లు.. బంగారం పదిలం

- చోరీకి దుండగుల విఫలయత్నం

దుబ్బాక, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోడళ్ల ముందుచూపు ఇంట్లోని బంగారం దొంగలపాలు కాకుండా కాపాడింది. ఈ సంఘటన దుబ్బాక మండలం గోసాన్‌పల్లి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. బుధవారం దుబ్బాక ఎస్‌ఐ కీర్తిరాజు తెలిపిన వివరాల ప్రకారం... గోసాన్‌పల్లి గ్రామానికి చెందిన ఆసిక నర్సింహులు తన ఇంటికి తాళం వేసి అనారోగ్యంతో ఉన్న బంధువును పరామర్శించడానికి భార్యతో కలిసి ఓ ఆసుపత్రికి వెళ్లారు. ఇదే అదునుగా దొంగలు ఇంట్లోకి చొరబడి, బీరువాను పగలగొట్టి చోరీకి ప్రయత్నించారు. ఇంటికి తిరిగి వచ్చిన యజమాని తాళం పగిలి ఉండడం చూసి, ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. నర్సింహులు కుమారులు అసిక ప్రభాకర్, అర్జున్ తమ భార్యాపిల్లలతో కలిసి వృత్తిరీత్యా వేరే చోట ఉండడంతో, వారికి చెందిన 18 తులాల వరకు బంగారం చోరీ జరిగిందని అందరూ భావించారు. ఈ సమాచారాన్ని కోడళ్లు తన్విక, చామంతికి చేరవేయగా.. అప్పటికే వారు ముందుచూపుగా ఇంట్లోనే ఎవరికీ తెలియని ప్రదేశంలో బంగారాన్ని ఒక బ్యాగులో పెట్టి దాచిపెట్టినట్లు చెప్పారు. పోలీసులు ఆ బ్యాగును పరిశీలించగా బంగారు నగలు కనిపించాయి. దీంతో ఇంటి యజమాని ఊపిరి పీల్చుకున్నారు.

ఎనిమిది తులాల బంగారు గాజులు చోరీ

హుస్నాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని బస్టాండ్ ఎదుట ఉన్న ఎస్‌వీ రమణకు చెందిన ఇంట్లో బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న ఎనిమిది తులాల బంగారు గాజులను దోచుకెళ్లినట్లు బాధితులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంట్లో పని చేసే వారు తీసుకెళ్ళారా..? లేక ఎవరైనా చోరీకి పాల్పడ్డారా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. బాధితులు ఇప్పటికీ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

నలుగురు నిందితుల అరెస్ట్

వర్గల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నలుగురు నిందితులను గౌరారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి వివరాలను బుధవారం గజ్వేల్ ఏసీపీ నర్సింహులు మీడియాకు వెల్లడించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన పర్వతం నర్సింహులు (35), తూర్పాటి వంశీ (20), కొల్లూరు గ్రామానికి చెందిన 15 ఏళ్ల మైనర్ కొన్ని రోజులుగా వర్గల్, రాయపోల్, ములుగు మండలాల్లోని ఆలయాల తాళాలు పగలగొట్టి ఇత్తడి గంటలు, రాగి పళ్లాలు, ఇతర పూజ వస్తువులు, హుండీలోని డబ్బులను దోచుకెళ్లేవారు. వరుసగా చోరీలతో గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గౌరారం ఎస్‌ఐ కరుణకర్‌రెడ్డి నిఘా పెంచారు. నమ్మదగిన సమాచారం మేరకు వర్గల్ గ్రామంలోని కల్లుదుకాణంలో ఇద్దరిని, ఓ బాలుడిని అదుపులోకి తీసుకుని విచారించడంతో చోరీలు చేసినట్లు అంగీకరించారు. వీరు దొంగలించిన వస్తువులను వర్గల్‌కు చెందిన కూరాకుల అంజనేయులుకు విక్రయించగా, అతనినీ అరెస్ట్ చేశారు. నిందితులు రాయపోల్ మండలంలోని మీరా మీరానగర్‌లో వీరప్ప స్వామి గుడిలో చోరీ చేశారు. ములుగు మండలం తునికి బోల్లారంలో ఓ ఇంటి ఎదుట నిలిపి ఉన్న టీవీఎస్ ఎక్స్‌ఎల్‌ను ఎత్తుకెళ్లారు. వర్గల్ మండలం శాఖారం గ్రామంలోని పెద్దమ్మ గుడి, రాయపోల్ మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో పెద్దమ్మ గుడి, అనాజీపూర్ గ్రామంలోని పెద్దమ్మ గుడి, గొల్లపల్లి గ్రామంలోని పెద్దమ్మ గుడి, వర్గల్ మండలంలోని తునికిఖాల్సా గ్రామంలో ఎల్లమ్మ దేవాలయం, ఉమా లింగేశ్వరస్వామి ఆలయంలో హుండీ ధ్వంసం, వేలూర్ గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయాలలో తాళాలు పగులగొట్టి గుడిలో ఉన్న ఇత్తడి ప్లేట్, మాణిక్యాలు, గుడి గంటలు, ఇతర వస్తువలు దొంగలించినట్లు తేలింది. నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోపెడ్, ఒక పెద్ద గుడి గంట, ఇత్తడి ప్లేట్, రెండు ఇత్తడి మాణిక్యాలు, రాగి చెంబు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పర్వతం నర్సింహులుపై తొమ్మిది కేసులు ఉండగా, చిన్న కోడూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం చేసిన కేసులో గతంలో శిక్ష అనుభవించి జైలుకు వెళ్లి వచ్చాడు. తూర్పాటి వంశీపై రెండు కేసులు, బాలుడిపై మూడు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

వడ్ల కుప్పలను ఢీ కొని రెండు ఆటోలు బోల్తా

- లక్క్మాపూర్ వద్ద పాదచారి ఢీకొన్న బైక్
- మూడు ఘటనల్లో 16 మందికి గాయాలు

రామాయంపేట, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): మూడు ప్రమాదాల్లో 16 మంది గాయాల పాలైన ఘటనలు రామాయంపేట మండల పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. అక్కన్నపేట శివారు ఎల్కతుర్తి హైవేపై వరి ధాన్యం కుప్పలను ఢీకొని ఒకే చోట రెండు ఆటోలు అదుపుతప్పి బోల్తాపడగా.. 13 మంది ప్రయాణికులు గాయపడ్డారు. అలాగే ఇదే మండలం లక్మాపూర్ గేట్ వద్ద ద్విచక్రవాహనదారుడు పాదచారిని ఢీకొనగా ముగ్గురు గాయపడ్డారు.

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

గజ్వేల్ రూరల్ నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంగుపల్లికి చెందిన బక్కోళ్ల కుమార్(25) నాలుగేళ్ల నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం గ్రామంలోని దుర్గమ్మ దేవాలయం వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కుమార్ (ఫైల్)



కుటుంబ సమేతంగా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్

వైభవంగా స్వామివారి కల్యాణం

● హాజరైన ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్

ఝరాసంగం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతంలో ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఉదయం అమృత గుండంలో స్నానాలు ఆచరించి, స్వామి వారి దర్శనం కోసం క్యూలో బారులు తీరారు. ఆలయ ఆవరణలో దీపాధన కార్యక్రమాలను చేసి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా స్వామి వారి కల్యాణం

కేతకీ ఆలయంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారి కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ కుటుంబ సమేతంగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మొదట ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హనుమంతు రావు పాటిల్, బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖామణి అదూత గిరి మహారాజ్, ధనసిరి ఆశ్రమ పీఠాధిపతి విశ్వేశ్వర శివచార్య మహారాజ్, ఆలయ ఛైర్మన్ చంద్రశేఖర్, ఆలయ ఈవో శివరుద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

అష్టాదశ శక్తిపీఠ ఆలయ వార్షికోత్సవాలు షురూ



కొండపాక, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):కొండపాక ఆనంద నిలయం ఆవరణలో గల అష్టాదశ శక్తిపీఠ దేవాలయంలో ద్వితీయ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం ఉమారామలింగేశ్వర శాంతి కల్యాణ మహోత్సవం కనులపండవగా నిర్వహించారు.

మద్దతు ఉత్తదేనా?

● సోయా రైతుల ఆవేదన
● ఇంకా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని అధికారులు
● నెలరోజులుగా రైతుల ఎదురుచూపులు
● తప్పనిపరిస్థితుల్లో దళారులకు విక్రయం
● క్వింటాల్‌కు రూ.1400 చొప్పున నష్టపోతున్న అన్నదాతలు

కంగ్టి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు ప్రభుత్వాలు మద్దతు ధరలు ప్రకటించడంలో చూపిన ఆర్భాటం, వాటికి అనుగుణంగా సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో చూపడం లేదు. ఈ తీవ్ర జాప్యం కారణంగా రైతులకు ఎలాంటి మేలు జరగడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలను సోషల్ మీడియాలో, పత్రికా ప్రకటనల్లో చూసి సంతోషించినా, పంట అమ్ముకునే సమయానికి రైతులకు దళారులను ఆశ్రయించక తప్పడం లేదు. దీనికి ప్రధాన కారణం, రైతులకు అందుబాటులో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడమే.

నెల రోజుల క్రితమే నూర్పిడి..

వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉన్న కంగ్టి మండలంలో ఈ ఖరీఫ్‌లో వర్షాధారం కింద దాదాపు 12 వేల ఎకరాల్లో సోయా పంటను సాగు చేశారు. గిరిజన రైతులు తమకు అనుకూలంగా ఉన్న గట్టు భూముల్లో అధికంగా మొక్కజొన్నను కూడా సాగు చేశారు. సోయాతో పాటు మొక్కజొన్న పంటలను రైతులు దాదాపు నెల రోజుల క్రితమే నూర్పిడి చేయించారు. ఈసారి ఎడతెరిపి లేని వర్షాలు కురిసినప్పటికీ, రైతులు ఎంతో కష్టపడి పంటను



తుర్కవడగాంలో సోయా పంటను ఆరబెడుతున్న రైతు

కాపాడుకున్నారు. అధిక వర్షాల కారణంగా ఈ సంవత్సరం సోయాతో పాటు ఖరీఫ్ పంటల దిగుబడులు బాగా తగ్గాయి.

దళారులకే దిక్కు..

ప్రభుత్వం మొక్కజొన్నలకు రూ.2,400, సోయా పంటకు రూ.5,400 మద్దతు ధర ప్రకటించింది. కానీ, ఇప్పటికీ రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో, పంట సాగు, పెట్టుబడుల కోసం చేసిన అప్పులు చెల్లించాల్సిన తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు సోయా, మొక్కజొన్నలను దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. ప్రైవేటు వ్యాపారులు రైతుల వద్ద నుంచి సోయాను క్వింటాల్‌కు కేవలం రూ.4,000 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. దీంతో, ఒక క్వింటాల్ సోయాపై రైతు రూ.1,400 వరకు నష్టపోవాల్సి వస్తోంది. రైతులు దళారులకు పంటలు అమ్మి నష్టపోవద్దని ఉపన్యాసాలు ఇచ్చే అధికారులు, ప్రజా ప్రతినిధులు... సమయానికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించకపోవడంలో ఆంతర్యం ఏమిటని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

మద్దతు ధర లభిస్తేనే మేలు!



మండలంలో ప్రభుత్వం తక్షణమే సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి రైతులకు మేలు చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే చాలా ఆలస్యం జరిగింది. దళారులు రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకొని తక్కువ ధరకే సోయా కొనుగోలు చేస్తున్నారు. దిక్కుతోచని స్థితిలో రైతులు దళారులకు అమ్ముకోవాల్సి వస్తుంది.

- పంతులు నాయక్, రైతు, పర్తుతండా

వర్షాలతో దిగుబడులు బాగా తగ్గాయి



గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఖరీఫ్ ఆరంభం నుంచి భారీ వర్షాలు కురవడంతో సోయా పంట దిగుబడులు బాగా తగ్గాయి. ఎన్నో ఆశలతో పెట్టుబడులు పెట్టినప్పటికీ రైతులకు ఏమి మిగలడం లేదు. కనీసం మద్దతు ధరకైనా ఉన్న కొద్ది పంటను అమ్ముకుందామంటే, కొనుగోలు కేంద్రాలు లేక అది కూడా అందని ద్రాక్షగానే మిగులుతుంది.

- మెండె హన్మారెడ్డి, రైతు, కంగ్టి

నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

● హాజరుకానున్న 935 మంది విద్యార్థులు

హత్నూర, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన హత్నూరలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల కళాశాలలో రాష్ట్రస్థాయి 11వ జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీకాంత్ తెలిపారు. ఈ క్రీడోత్సవాల్లో రాష్ట్రంలోని 11 పాఠశాలలకు చెందిన 935 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. వాలీబాల్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, ఫుట్‌బాల్ వంటి క్రీడలను అండర్-14, 17, 19 స్థాయి విద్యార్థులకు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. విద్యార్థులకు భోజన, వసతి, ఆరోగ్యం మొదలైన వాటిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీకాంత్ స్పష్టం చేశారు.



పరిశ్రమ ఎదుట దర్నా చేస్తున్న గ్రామస్థులు

పరిశ్రమ మూసివేయాలని ధర్నా

శివ్వంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పోతులబోగుడ గ్రామంలోని సుగుణ పరిశ్రమను తక్షణమే మూసివేసి తమ గ్రామాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ బుధవారం గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పరిశ్రమ ముందు రెండు గంటల పాటు బైఠాయించి ధర్నా నిర్వహించారు. పరిశ్రమ నుంచి వెలువడుతున్న దుర్వాసన కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దుర్వాసనతో కాలుష్య సమస్య ఎదుర్కొంటున్నామని వాపోయారు. సుమారు 15 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమ మొదట సుగుణ పౌల్ట్రీ ఫామ్‌గా నడిచి, నాలుగు సంవత్సరాల క్రితం సుగుణ హేచరీస్‌గా మార్చబడిందన్నారు. కోళ్ల వ్యర్థాలను రోడ్డుకు సమీపంలో పారబోయడం వల్ల ఈగలు, దోమలు పెద్ద సంఖ్యలో వ్యాప్తి చెంది, ప్రజలు రోగాల బారిన పడుతున్నారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. చుట్టుపక్కల వ్యవసాయ భూములు ఉండటం వల్ల నీటి వనరులు కలుషితం అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, పరిశ్రమపై చర్యలు తీసుకొని, గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పోతులబోగుడ గ్రామస్థులు డిమాండ్ చేశారు.



మార్క్సనగర్ యూపీహెచ్‌సీలో వ్యాక్సిన్ వాయిల్‌ను పరిశీలిస్తున్న బృందం

ముగిసిన సీఆర్ఎం బృందం పర్యటన

● చివరి రోజు సంగారెడ్డిలోని రెండు ఆరోగ్య కేంద్రాల పరిశీలన

సంగారెడ్డి అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో కామన్ రివ్యూ మిషన్ (సీఆర్ఎం) బృందం పర్యటన ముగిసింది. మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా పలు ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలు, సబ్ సెంటర్లను తనిఖీ చేసిన విషయం తెలిసిందే. చివరి రోజు బుధవారం సంగారెడ్డి పట్టణంలోని మార్క్సనగర్ యూపీహెచ్‌సీని కేంద్ర బృందం సభ్యులు సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఓపీ, మందులు, ఎన్‌సీడీ స్ర్కీనింగ్, ల్యాబ్ పరీక్షలు, రికార్డుల నిర్వహణ, వ్యాక్సినేషన్, కేంద్ర వైద్య పథకాల అమలుపై ఆరా తీశారు. అనంతరం ఇంద్రనగర్‌లోని ఆయూష్ డిస్పెన్సరీలను సందర్శించారు. ఆయుర్వేద, హోమియోపతి, యునానీ డిస్పెన్సరీల డాక్టర్లతో మాట్లాడారు. ఆయా డిస్పెన్సరీలకు ఎటువంటి సమస్యలతో ప్రజలు వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అటెండెన్స్, ఈ-ఔషధి తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయూష్ కన్సల్టెంట్ డా.రంజన్ దాస్, ఎస్‌పీఎం డా.సంతోష్, ప్లానింగ్ పీవో జగన్నాథ్‌రెడ్డి, డీఐవో డా.శశాంక్ దేశపాండే, మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ చాంపియన్‌గా ఉమ్మడి మెదక్ జిల్లా

మెదక్ అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్టస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు ఘనవిజయం సాధించింది. పాఠశాల క్రీడా సమాఖ్య తెలంగాణ ఆధ్వర్యంలో వికారాబాద్‌లో మూడు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 బాలికల టోర్నమెంట్ జరుగుతుంది. బుధవారం రంగారెడ్డి జిల్లా జట్టుతో జరిగిన సెమీఫైనల్‌లో 1-0 తేడాతో ఉమ్మడి మెదక్‌జిల్లా జట్టు విజయం సాధించి ఫైనల్‌కు అర్హత పొందింది. ఫైనల్‌లో ఉమ్మడి నల్గొండ జట్టుపై హోరాహోరీగా జరిగిన మ్యాచ్ డ్రాతోయ ముగిసింది. పెనాల్టీ షూట్ అవుట్‌లో ఉమ్మడి మెదక్ జట్టు నల్గొండ జట్టుపై 3-2 గోల్స్ తేడాతో గెలిచి కప్ కైవసం చేసుకుందని మెదక్ జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగరాజు తెలిపారు.



గెలిచిన ఆనందంలో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు

ఐఐటీహెచ్‌లో రెండో ఎడిషన్ హాఫ్ మారథాన్

● రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 10 వరకు గడువు
● 30న రన్నింగ్ పోటీలు

కంది, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సాహించడానికి సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్(ఐఐటీహెచ్)లో నవంబరు 30న రన్నర్స్ హాఫ్ మారథాన్ 2వ ఎడిషన్‌ను నిర్వహించనున్నట్లు ఐఐటీహెచ్ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, నగరాల నుంచి ఫిట్నెస్ ఔత్సాహికులు, రన్నర్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 10 తేదీ వరకు ఐఐటీహెచ్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని తెలిపారు. 5కే రన్, 10కే రన్, 21కే మారథాన్‌లతో పాటు ఫన్‌రన్ ఈవెంట్లు ఉంటాయని, విజేతలకు ప్రశంసా పత్రాలతో పాటు, పతకాలు, బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొనేవారు 18 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలని తెలిపారు.



బోరంచ టూరిజానికి రూ.2.5 కోట్లు

● ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నారాయణఖేడ్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మనూరు మండలం బోరంచను టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం రూ.2.5 కోట్లు మంజూరు చేసిందని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, మనూరు మండలం బోరంచ నది ఒడ్డున చారిత్రకమైన నల్ల పోచమ్మ ఆలయంతో పాటు సంగమేశ్వర ఆలయాలు ఉన్నాయన్నారు. బోరంచ బ్యాక్‌వాటర్ సంగమేశ్వర ఆలయం వెనుక వరకు ఉంటుందన్నారు. బోరంచ పోచమ్మను దర్శించుకునేందుకు తెలంగాణ నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున వస్తుంటారని తెలిపారు. ఈ నేపథ్యంలో, బోరంచను టూరిజం స్పాట్‌గా మార్చాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కోరగా, ఆయన నివేదిక తెప్పించుకొని, మొదటి దశలో రూ.2.5 కోట్లను మంజూరు చేశారని ఎమ్మెల్యే వివరించారు. ఈ నిధులతో మంజీరాలో బోటింగ్‌తో పాటు వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. మరిన్ని నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరతామని, అంతేకాకుండా మనూరు మండలం కమలాపూర్ ప్రాజెక్టు, నారాయణఖేడ్ పట్టణానికి సమీపంలో ఉన్న నల్లవాగును కూడా టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేయాలని కోరామని సంజీవరెడ్డి తెలిపారు. బోరంచకు నిధులు మంజూరు చేయించినందుకు పోచమ్మ, సంగమేశ్వర ఆలయ కమిటీ బాధ్యులు ఎమ్మెల్యే సంజీవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శనరెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డితో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



నూతన ఒర'బడి'

● మారిన బుసారెడ్డిపల్లి పాఠశాల రూపురేఖలు
● పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణం
● గోడలపై అర్థవంతమైన పెయింటింగ్స్
● హెచ్‌ఎం రమణ సొంత ఖర్చుతో పనులు
● 40 నుంచి 70కి పెరిగిన విద్యార్థుల సంఖ్య



చిత్రాలను గీస్తున్న ఉపాధ్యాయుడు

మునిపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జ్ఞానాన్ని బోధించడమే కాకుండా, విశాల హృదయంతో అత్యుత్తమ సేవలు అందిస్తూ... కార్పొరేట్ స్కూల్‌కు దీటుగా సర్కారు బడి రూపురేఖలను మార్చారు సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లి ఉన్నత ప్రాథమిక పాఠశాల (యూపీఎస్) హెచ్‌ఎం ఎస్‌వీ రమణ కుమార్. కేవలం వృత్తి ధర్మంగా కాకుండా, పాఠశాల అభివృద్ధికి తనవంతు పాత్ర పోషిస్తూ, ఉపాధ్యాయ వృత్తికే ఆదర్శంగా నిలిచారు. సొంత డబ్బుతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తూ అందరి మన్ననలు పొందారు. పాఠశాల భవనం, ఆవరణలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఆయన చేసిన సేవలకు ముగ్ధులైన గ్రామస్థులు, ఆయనకు ప్రమోషన్ వచ్చినప్పటికీ, తమ ఊరి బడిలోనే కొనసాగాలని విజ్ఞప్తి చేశారు. వారి ప్రేమకు బద్ధుడై రమణ కుమార్ తన ప్రమోషన్‌ను కూడా రద్దు చేయించుకోవడం విశేషం.

ప్రైవేటును వీడి ప్రభుత్వ బడికి..

రమణ కుమార్ కృషితో ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న పిల్లలు, బడి మానేసిన విద్యార్థులు కూడా సర్కారు బడి వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో 40 మంది ఉన్న విద్యార్థుల సంఖ్య ఇప్పుడు 70కి పెరిగింది.

ఎనిమిదేళ్ల ఏళ్ల క్రితం రమణ కుమార్ ఈ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా వచ్చినప్పుడు అనేక సమస్యలు ఉండేవి. ప్రభుత్వ పరంగా ప్రతి సంవత్సరం వచ్చే రూ.10 వేలతో స్పోర్ట్స్ సామాగ్రి కొనుగోలు చేశారు. తన సొంత డబ్బు రూ.72 వేలతో పాఠశాల ముఖ్యద్వారం ఏర్పాటు చేయించారు. అదే గ్రామానికి చెందిన గడీల రమేష్ సహకారంతో పాఠశాల ఆవరణలో సరస్వతి విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. స్కూల్ ముఖద్వారం నుంచే పచ్చని వనంలా మొక్కలను పెంచి పాఠశాలకు కొత్త అందాన్ని తీసుకొచ్చారు. విద్యార్థులు భోజనం చేసిన తర్వాత మిగిలిన ఆహారాన్ని ఉపయోగించి సేంద్రియ ఎరువు తయారు చేసి, ఆవరణలో కిచెన్ గార్డెన్ (కూరగాయల తోట) ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లను సైతం వినియోగంలోకి తీసుకువచ్చారు.

ఉపాధ్యాయుడే ఆర్టిస్టుగా మారి..

పాఠశాల ఉపాధ్యాయుడు మధు ఆర్టిస్టుగా మారి గోడలపై పెయింటింగ్ వేస్తూ బడికి అందాన్ని తెచ్చారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివిధ అంశాలను చిత్రీకరించారు. విద్యార్థుల బోధనతో పాటు పెయింటింగ్‌తో పాఠశాల అభివృద్ధిలో పాలుపంచుకుంటున్నారు.

ఉద్యోగ విరమణ వరకూ ఇక్కడే ఉంటా..

గ్రామస్థులు, ఉపాధ్యాయుల సహకారంతోనే పాఠశాల ఈ స్థాయిలో ఉంది. విద్యార్థులను తన సొంత పిల్లల్లా చూసుకుంటున్నాను. పాఠశాలను మరింత అభివృద్ధి చేయాలన్నదే నా లక్ష్యం. నా ఉద్యోగ మిరమణ వరకూ ఇక్కడే ఉంటాను. పాఠశాల ప్రగతి కోసం దాతలు ముందుకు రావాలి.

- ఎస్‌వీ రమణ కుమార్, హెచ్‌ఎం

నా పిల్లలను ఈ బడిలోనే చేర్పించాను..



మొదట నా ఇద్దరు పిల్లలను ప్రైవేటు బడికి పంపిందామనుకున్నాను. కానీ పాఠశాలపై రమణ సార్ తీసుకుంటున్న చొరవ చూసి ప్రభుత్వ బడిలోనే చేర్పించాను సార్ వచ్చినప్పటి నుంచి పాఠశాల రూపురేఖలే మారిపోయాయి.

- సతీష్, స్థానికుడు



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

టిప్పర్ల యజమానుల ఆగడాలను అరికట్టాలి

● లక్డారం గ్రామస్థుల నిరవధిక దీక్ష



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

పటాన్‌చెరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) :రోడ్లపై అరాచకం సృష్టిస్తూ ప్రజల ప్రాణాలు బలిగొంటున్న టిప్పర్ల యజమానుల ఆగడాలపై లక్డారం గ్రామస్థులు కన్నెర చేశారు. వెంటనే వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం గ్రామస్థులు లక్డారం రోడ్డుపై ఆందోళన చేయడంతోపాటు నిరవధిక దీక్షలు చేపట్టారు. అధిక లోడుతో రాకపోకలు సాగిస్తూ రోడ్లను పాడు చేస్తున్నారన్నారు. టిప్పర్లతోనే రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని ఆరోపించారు. క్రషర్ల వల్ల గ్రామంలోని ఇళ్లన్నీ బీటలు వారుతున్నాయని వాపోయారు. పంట పొలాలన్ని పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాయల్టీ, వే బిల్లులు లేకుండా రవాణా చేస్తున్న టిప్పర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ యువ సంఘం నాయకులు కృష్ణ గౌడ్, చంద్రశేఖర్, రాఘవరెడ్డి, రామచంద్రారెడ్డి, డాకయ్య సాగర్, వీరేశం, శ్రీకాంత్, నరసింహ గౌడ్, సంజీవరెడ్డి, గోపాల్ చారి, నాగరాజు, సాగర్ పాల్గొన్నారు. స్థానిక టిప్పర్ల యజమానులు నిర్మల్, నాగార్జున కూడా ఈ ఆందోళనలో పాల్గొనడం గమనార్హం.


సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి శివాలయం ఆవరణలో భక్తుల కోలాహలం


పటాన్‌చెరు రూరల్ : రుద్రారం గణేష్ ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


పెద్దశంకరంపేటలోని మాణిక్‌ప్రభు మందిరంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఆలయాలకు కార్తీక శోభ


చిలప్‌చెడ్ : జగ్గంపేట స్వయంభూ సిద్దిలింగేశ్వరస్వామి సన్నిధిలో దీపాలను వెలిగిస్తున్న మహిళలు

కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయాలు కిటకిటలాడాయి. భక్తులు ఉదయం నుంచే ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. పలు ఆలయాల్లోని నీటి గుండాలు, నదీ తీరాల్లో పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు వదిలారు.

- న్యూస్ నెట్‌వర్క్


పాపన్నపేట : ఏడుపాయల్లో దుర్గామాతకు దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మహిళలు


వెల్దుర్తి మండలంలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా వెలిగించిన దీపాలు


మనోహరాబాద్ : కాళ్లకల్ గ్రామంలోని శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


చేగుంట మండల కేంద్రంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపాలు వెలిగిస్తున్న మహిళలు


జహీరాబాద్ పట్టణంలోని దత్తగిరి ఆశ్రమం వద్ద కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు


కోహీర్ : దీపాలతో వెలిగిపోతున్న బిలాల్‌పూర్‌లోని మల్లికార్జునస్వామి ఆలయం


అమీన్‌పూర్ : ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కౌడిపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలం కేంద్రంలోని 133 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా ఉండవని ఏఈ శరత్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌడిపల్లి, సబ్‌స్టేషన్ పరిధిలోని కొల్చారం, చిల్‌ఎచెడ్ మండలాల్లో సైతం ఉదయం 11.30 నుంచి 1.30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంతో పాటు కొన్ని మరమ్మతులు ఉన్నాయన్నారు.

హరీశ్‌రావుకు పలువురి పరామర్శ

మునిపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా మునిపల్లి మాజీ ఎంపీపీ శైలజశివశంకర్, వైస్ ఎంపీపీ బాబాపటేల్, మాజీ సర్పంచులు రమేష్, విశ్వనాథం, శ్రీనివాస్, ప్రభు తదితరులు హైదరాబాద్‌లోని హరీశ్‌రావు నివాసానికి వెళ్లి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

కోహీర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మున్సిపల్ పట్టణంలోని పలు కాలనీల్లో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోహీర్ మున్సిపాలిటీకి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఫిర్దోస్‌తో పాటు కోహీర్‌కు చెందిన పలువురు యువకులు కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు.

వాచ్‌మన్, హెడ్ కుక్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వెల్దుర్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వెల్దుర్తిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నైట్ వాచ్‌మెన్-1, హెడ్ కుక్-2 పోస్టులకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఎస్‌వో ఫాతిమా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 8 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దీపారాధనతో మోక్షం

నాగల్‌గిద్ద, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దీపారాధనతో మానవ జన్మకు మోక్షం లభిస్తుందని దేవిదాస్‌మహరాజ్ అన్నారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం మండల పరిధిలోని ఇరక్‌పల్లి మెగాతండాలో కార్తీక దీపోత్సవ, ఆకాష్‌దీప్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ వరం

చిలప్‌చెడ్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చండూరు గ్రామానికి చెందిన సౌమ్య శ్రీకాంత్‌కు మంజూరైన రూ.1.60 లక్షల చెక్కును ఆయన అందజేసి మాట్లాడారు.

రైతుల సౌలభ్యం కోసం కొనుగోలు కేంద్రాలు

- ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ నరేందర్


సిర్గాపూర్ మండలం అంతర్గాంలో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నరేందర్

కల్హేర్/సిర్గాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతుల సౌలభ్యం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గుండు నరేందర్ అన్నారు. బుధవారం సిర్గాపూర్ మండల పరిధి అంతర్గాం గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలోకి దళారులు ప్రవేశించకుండా అధికారులు చర్యలు చేపట్టాలని వెంకట్‌రాములు, నరేందర్ కోరారు. ఈ కార్యక్రమంలో అంతర్గాం మాజీ సర్పంచ్ రవి పటేల్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

●చిన్నశంకరంపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను ఇబ్బందులు పెట్టద్దని తహసీల్దార్ మాలతి సీఈవోలకు సూచించారు.చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు గవ్వలపల్లి, రుద్రారం, వెంకట్రావుపల్లి గ్రామాల్లో సొసైటీ, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను తహసీల్దార్, ఏవో ప్రవీణ్ సందర్శించారు.

●వెల్దుర్తి: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్య పాల్గొన్నారు.

ఆంక్షలు పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్


నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మల్లేశ్‌గౌడ్

నర్సాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాల వల్ల రైతులు చేతికొచ్చిన ధాన్యం నష్టపోయినందున అధికారులు ఎటువంటి ఆంక్షలు, నిబంధన పేరిట ఇబ్బంది పెట్టకుండా తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం నర్సాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగసాని సురేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మాటలతో కాలం వెళ్లదీయడం తప్పా ప్రజల గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికే జిల్లాలో అనేక ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు కూడా పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదని, దీంతో రోజుల తరబడి రైతులు తమ ధాన్యంతో నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు చొరవ తీసుకుని అన్ని ప్రాంతాల్లో కేంద్రాలను ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు గుండం శంకర్, నారాయణరెడ్డి, బాలరాజ్, కృష్ణ, రాజు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో ఎంపీ, ఎమ్మెల్యే ప్రచారం


మునిపల్లి : ఎర్రగడ్డలోని రహమత్‌నగర్‌లో ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ నాయకులు

నారాయణఖేడ్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతుగా జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి బుధవారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. సబ్జీకాలనీలో ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్, షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్‌రషీద్‌ఫరిజోద్దీన్, ఎంఐఎం నాయకుడు రహమతుల్లా, సంగారెడ్డి మాజీ జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు రషీద్‌తో కలిసి ప్రచారం చేశారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి జూబ్లీహిల్స్ నివాసముంటున్న ఖేడ్ ప్రాంతానికి చెందినవారి ఇంటికెళ్లి ప్రచారం చేశారు.

●మునిపల్లి : జూబ్లీహిల్స్ ఎర్రగడ్డ డివిజన్‌లో అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు అభ్యర్థి సునీతకు ఓటేయాలని ప్రచారం చేశారు.

●జిన్నారం : జిన్నారం మండలం జిన్నారం, కాజిపల్లి, గడ్డపోతారం గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, నాయకులు వెంకటేశంగౌడ్, ఆదిరామకృష్ణ, భార్గవ, సత్యనారాయణ తదితరులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూంలలో పోలీస్ అవుట్ పోస్టు

రామచంద్రాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరు డబుల్ బెడ్‌రూంలలో పోలీస్ అవుట్ పోస్టును మంగళవారం రాత్రి సీఐ గణేష్‌పటేల్ ప్రారంభించారు. నేరాల అదుపునకు అవుట్ పోస్టు ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ఇక్కడ ఐదుగురు పోలీసులు అందుబాటులో ఉంటారని సీఐ తెలిపారు. పోలీసుల సేవలను సద్వినియోగపర్చుకోవాలన్నారు.

గేదెను ఢీకొన్న బైక్, యువకుడికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన యువకుడు

చేగుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బైక్‌తో గేదెను ఢీకొట్టిన ఘటనలో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన చేగుంట మండల పరిధిలోని కరీంనగర్ రహదారిపై బుధవారం రాత్రి చోటుచేసుకుంది. చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. చేగుంటలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న దౌల్తాబాద్ మండలం ఉప్పరపల్లికి చెందిన కయ్యగారి హరికృష్ణ(22) బైక్‌పై చేగుంట వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న గేదెను ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతడి తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

చేగుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నార్సింగి మండలం జప్తి శివనూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సరోజినీ నగర్‌లో బుధవారం రాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.4,460 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సృజన తెలిపారు.

విశ్వేశ్వర ఆలయ ప్రతిష్ఠాపనలు ప్రారంభం


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి అనుపమ్మరెడ్డి

నారాయణఖేడ్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ పట్టణంలోని శివనగర్ కాలనీలో బుధవారం విశ్వేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపనలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కుంభకోణం నుంచి తీసుకొచ్చిన విశాలాక్షి సమేత విశ్వేశ్వర విగ్రహాలకు భాజాభజంత్రీలు, కలశాలతో స్వాగతం పలుకుతూ మంగల్‌పేట నుంచి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా పురోహితులు మోహన్‌జ్యోషి ఆధ్వర్యంలో యాగశాల ప్రవేశం, పుణ్యాహవచనం, వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమ్మరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు.

అభయాంజనేయస్వామి వార్షికోత్సవం

నారాయణఖేడ్ పట్టణంలోని సిరూర్ కాలనీలో శివపంచాయతన అభయాంజనేయస్వామి పంచమ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి అభిషేకాలు, మధ్యాహ్నం శివపార్వతుల కల్యాణం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా జ్వాలాతోరణం

నారాయణఖేడ్ పట్టణంలోని చరిత్రాత్మకమైన కాశీనాథ్ ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం జ్వాలాతోరణం కార్యక్రమాన్ని పురోహితులు గురుజ్యోషి ఆధ్వర్యంలో నిర్వహించారు. నారాయణఖేడ్ పట్టణంలోనే మొదటిసారిగా జ్వాలాతోరణంతో పాటు దీపోత్సవం, శివ పార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు.

అభివృద్ధికి నిధులు : కార్పొరేటర్


సీసీరోడ్డు పనులు పరిశీలించిన కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనులు చేపట్టడానికి నిధులు మంజూరవుతున్నాయని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు డివిజన్ పరిధి జాతీయ రహదారి నుంచి మున్నూరుకాపు సంఘం హాలు వరకు జరుగుతున్న సీసీరోడ్డు వెడల్పు పనులను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే గుత్తేదారులపై చర్యలు తీసుకునేట్లు సిఫార్సు చేయాల్సి ఉంటుందని చెప్పారు.

గ్రామాల్లో ఇబ్బందులు ఉండొద్దు : ఎంపీడీవో

చిన్నశంకరంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీవో దామోదర్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం ఎంపీపీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాలు స్వచ్ఛత పాటించేలా కృషి చేయాలని, మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గిరిజారాణి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో మత్స్యకారులకు ఉపాధి


దేవుని చెరువులో చేప పిల్లలను వదులుతున్న మత్స్యకారులు

పుల్‌కల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చేపల పెంపకంతో మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందని ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మన్నె అనంతయ్య తెలిపారు. బుధవారం చౌటకూర్ మండలం చక్రియాలలోని చెరువులో ప్రభుత్వం పంపిణీ చేసిన 70 వేల చేప పిల్లలను వదిలారు. మత్స్యకారుల శ్రేయస్సు దృష్ట్యా చేప పిల్లలు కేటాయించినందుకు ముదిరాజ్‌లు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మిగులు భూమిని ఆలయానికి కేటాయించాలి

- తహసీల్దార్‌కు నస్తీపూర్ గ్రామస్థుల వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

హత్నూర, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండల పరిధి నస్తీపూర్ గ్రామ శివారులో గల రామాలయాన్ని ఆనుకొని సర్వే నంబరు 42లో గల మిగులు ప్రభుత్వ భూమిని రామాలయ అవసరాలకు కేటాయించాలని గ్రామస్థులు కోరారు. ఈ విషయమై బుధవారం తహసీల్దార్ పర్వీన్‌షేక్‌కు వినతిపత్రం అందజేశారు. ఆలయం దినదిన అభివృద్ధి చెందుతుండటంతో పాటు దాతల సహకారంతో ఫంక్షన్‌హాల్ నిర్మాణం చేయడం వల్ల భక్తుల తాకిడి ఎక్కువైందన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ సమీపంలోని మిగులు భూమిని రామాలయం అవసరాలకు కేటాయించాలని కోరారు.

మిషన్ భగీరథ.. వృథా


వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

జహీరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని అల్లానా కర్మాగారం మీదుగా బీదర్‌కు వెళ్లే రోడ్డు పక్కన గల మంజీరా పైప్‌లైన్ లీకై మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోంది. అయినా ఎవరూ పట్టించుకున్న పాపానపోవడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి మిషన్ భగీరథ పైపులైన్లకు మరమ్మతులు చేపడుతూ, లీకేజీలు కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా గోపాల కాలువలు


అశ్వవాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

నారాయణఖేడ్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సంజీవన్‌రావుపేటలో అనంతశయన మందిర వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని బుధవారం గోపాల కాలువలు, అశ్వవాహన సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు ప్రవీణ్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మెదక్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మాసాయిపేటలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో పలు ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి కృష్ణతేజ ఒక ప్రకటనలో తెలిపారు. హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, వాచ్‌మెన్(నైట్), స్కావెంజర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి చదివి ఉండాలని, స్కావెంజర్ ఉద్యోగానికి ఏడో తరగతి చదివి ఉండాలని చెప్పారు. ఈ నెల 8లోపు వెల్దుర్తిలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో సంబంధిత అధికారికి అందజేయాలని తెలిపారు.